
సాక్షి గుంటూరు

మంగళవారం । 26 । నవంబర్ । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 585.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 10,000 క్యూసెక్కులు వదిలారు.



నాగాభరణం కిరీటం బహూకరణ

మేడికొండూరు: మందపాడులోని చెన్నమల్లేశ్వర స్వామికి తుమ్మల కుమారస్వామి, ఆదిలక్ష్మి దంపతులు నాగాభరణం, తుమ్మల సత్యనారాయణ వెండి కిరీటాన్ని బహూకరించారు.

చంద్రికకు బంగారు పతకం



మంగళగిరి: పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక బంగారు పతకం సాధించింది. ఇటీవల సేలంలో జరిగిన పోటీలలో స్క్వాట్ 250 కేజీలు, బెంచ్ ప్రెస్ 110 కేజీలు, డెడ్ లిఫ్ట్ 200 కేజీలు కలిపి మొత్తం 560 కేజీలు బరువు ఎత్తి బంగారు పతకం సాధించింది.

న్యూస్‌రీల్

రేపు యూపీపీఎస్సీ ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష

నెహ్రూనగర్: యూపీపీఎస్సీ ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్షను ఈ నెల 27న గుంటూరు నగరంలోని బీసీ స్టడీ సర్కిల్(రాజాగారితోట)లో నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి మయూరి సోమవారం తెలియజేశారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలు జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఉదయం 10.30గంటలకు బీసీ స్టడీ సర్కిల్‌కు వద్ద హాజరుకావాలని ఆమె సూచించారు.

ఏఎస్‌ఐలకు ఉద్యోగోన్నతి పరీక్షలు



నగరంపాలెం: ఏఎస్‌ఐ నుంచి ఎస్‌ఐ ఉద్యోగోన్నతి కోసం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో సోమవారం రాత పరీక్ష నిర్వహించారు. రాత పరీక్షలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. గుంటూరు రేంజ్‌లోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లాలో విధులు నిర్వర్తించే 51 మంది పురుషులు, ఏడుగురు మహిళా ఏఎస్‌ఐలు పరీక్షలకు హాజరయ్యారు. ఒంగోలు పోలీస్ శిక్షణా కళాశాల ప్రిన్సిపల్ కమాండంట్ ఎస్పీ నగేష్ బాబు, ప్రకాశం జిల్లా ఏఎస్పీ (పరిపాలన) నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఏఎన్‌యూ: దక్షిణ, పశ్చిమ మండలాల(జోన్స్) అంతర్ విశ్వవిద్యాలయాల స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ మంగళవారం నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతాయని పోటీల నిర్వాహక కార్యదర్శి, ఏఎన్‌యూ వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ తెలిపారు. పోటీలకు వివరాలను సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. మహిళల కేటగిరీ పోటీలు మంగళవారం నుంచి 28 వరకు, పురుషులకు ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో 125 విశ్వవిద్యాలయాల నుంచి వెయిట్ లిఫ్టర్లు హాజరుకానున్నారని తెలిపారు. మంగళవారం జరిగే పోటీల ప్రారంభోత్సవ సభకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ప్రత్యేక ఆహ్వానితులుగా అర్జున అవార్డు గ్రహీత నీలం శెట్టి లక్ష్మి, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య, యూనివర్సిటీ అధికారులు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారని తెలిపారు. పోటీలకు వీసీ ఆచార్య కె గంగాధరరావు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారని పాల్ కుమార్ తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో షబీనాకు బంగారు పతకం



తెనాలి: పట్టణానికి చెందిన పవర్ లిఫ్టర్ షేక్ షబీనా మరో విజయం సాధించింది. సదరన్ రైల్వే, సేలం డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం సేలంలో నిర్వహించిన సౌతిండియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో 84 కిలోల విభాగంలో తలపడిన షబీనా, స్క్వాట్‌లో 190 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 90 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 180 కిలోల చొప్పున మొత్తం 460 కిలోల బరువులనెత్తి, ఓవరాల్‌గా ఈ విజయాన్ని అందుకుంది.

జగ్జీవన్‌రామ్ చైర్‌ను సందర్శించిన లిడ్‌కాప్ చైర్మన్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బాబూ జగ్జీవన్‌రామ్ చైర్‌ను సోమవారం ఏపీ లిడ్‌కాప్ చైర్మన్ పిల్లి మాణిక్యారావు సందర్శించారు. చైర్ ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యలను డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మాణిక్యారావు మాట్లాడుతూ చైర్ అభివృద్ధికి లిడ్‌క్యాప్ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చైర్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. అనంతరం వీసీ కె.గంగాధరరావును మర్యాద పూర్వకంగా కలిశారు.



పూజలందుకుంటున్న మూల విరాట్



స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



నాగేంద్రస్వామికి పాలు పోస్తున్న భక్తులు

ఓం నమః శివాయ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శివాలయం సోమవారం శివ నామస్మరణతో మార్మోగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని దీపాలు వెలిగించి, పూజలు చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా ఎటు చూసినా కార్తిక దీపాలు వెలిగించే భక్తులే కనిపించారు. తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి ప్రారంభమైంది. ఆలయ ఆవరణలో కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

– పెదకాకాని

ట్రాఫికర్‌తో పాట్లు.. ఫీట్లు

- నగరవాసులకు చుక్కలు చూపిస్తున్న ట్రాఫిక్
- మూడు వంతెనల వద్ద రాకపోకల నిలిపివేత
- సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే గేటు, శంకర్‌విలాస్ బ్రిడ్జిపై భారీగా నిలిచిపోతున్న వాహనాలు
- గంటల కొద్దీ ట్రాఫిక్ ఇక్కట్లు
- చక్రబంధంలో ఇరుక్కుపోతున్న వాహనదారులు, పాదచారులు
- విద్యార్థులు, ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు



నెహ్రూనగర్ రైల్వే గేటు వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహనదారులు

నెహ్రూనగర్: గుంటూరు నగరవాసులకు ట్రాఫిక్ తిప్పలు తలనొప్పిగా మారింది. రైల్వే ట్రాక్ ఎక్స్‌టెన్షన్ (విస్తరణ) పనుల నిమిత్తం మూడు వంతెనల(డొంక రోడ్డు) వద్ద సోమవారం నుంచి రాకపోకలు నిలిపివేశారు. దీంతో నగర ప్రజలు సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వేగేటు, శంకర్‌విలాస్ బ్రిడ్జి మీదుగా వన్ టౌన్ నుంచి టూ టౌన్‌కి, టూ టౌన్ నుంచి వన్ టౌన్‌కి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే, ఇక్కడే ట్రాఫిక్ సమస్య మరింత జటిలమైంది. వందలాది వాహనాలు రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ చక్రబంధంలో నగర ప్రజలు గంటల కొద్దీ ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొంత మంది ట్రాఫిక్ దెబ్బకు భయపడి వాహనాలను గేటు అవతల, ఇవతలకు పార్కు చేసుకుని నడుచుకుంటూ వెళ్లి పనులను చక్కపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రైల్వే గేటులతో తిప్పలు

అరండల్‌పేట, బ్రాడీపేట, లక్ష్మీపురం, శ్రీనగర్ నుంచి మూడు వంతెనల మీదుగా రాకపోకలు సాగించే వారు సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ రైల్వే గేటుల మీదుగా కొత్తపేట, ఆర్టీసీ బస్టాండ్, వన్ టౌన్‌లోకి ప్రవేశిస్తున్నారు. అయితే, ప్రతి ఐదు నిమిషాలకొకసారి రైల్వే గేటు పడటంతో వాహనదారులు గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎటు చూసినా వాహనాలే కన్పిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కూడా చిన్న ఖాళీ కూడా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకోసారి గేటు మధ్యలోనే వాహనాలు నిలిచిపోవడంతో రైలు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా గేట్ మేన్‌లు, పోలీసులు దగ్గరుండి వాహనాల ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు.



సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహనదారులు



శంకర విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద వాహనాల రద్దీ

అరవై రోజులూ కష్టాలే

రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి సంజీవయ్యనగర్ రైల్వే గేటు మీదుగా నెహ్రూనగర్, కొత్తపేటలోని పలు ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులు వెళుతుంటారు. అయితే, ఉదయం ట్రాఫిక్ రద్దీ పెరిగిపోవడంతో ట్రాఫిక్ చక్ర బంధంలో ఇరుక్కుపోతున్నారు. కొన్ని పాఠశాలల నిర్వాహకులు ట్రాఫిక్ సమస్యను తెలుసుకుని స్కూల్ గేటు క్లోజ్ చేసే సమయాన్ని కొంత మేరకు పెంచారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విధులకు హాజరయ్యే ఉద్యోగులు రైల్వే గేటుల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అటు శంకర్ విలాస్ బ్రిడ్జి మీద కూడా ట్రాఫిక్ చుక్కలు చూపిస్తోంది. హిందూ కాలేజీ సిగ్నల్స్ నుంచి ఇటు లాడ్జిసెంటర్ వరకు ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుపోతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన రైల్వే పనులను పూర్తి చేసి ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

కూటమి అరాచకాలపై పోరాటం ఆగదు

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



విలేకరులతో మాట్లాడుతున్న అంబటి

నగరంపాలెం: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుల అక్రమ అరెస్టులపై పోరాటం ఆగదని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు తెలిపారు. ఈనెల 17, 18, 19 తేదీల్లో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై, వైఎస్సార్ కుటుంబంపై, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు, కార్యకర్తలపై కూటమి పెద్దలు పెడుతున్న అసభ్యకరమైన పోస్టులపై ఇచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు ఎంత వరకు చేపట్టారనేది తెలుసుకునేందుకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆధారాల సహా ఫిర్యాదు

మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ట్వీట్ చేసిన రాష్ట్ర మంత్రి లోకేష్‌పై, తనపై ట్వీట్ చేసిన శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై ఆధారాలతో సహా పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇంటూరి కిరణ్‌ను రోజులు తరబడిగా పోలీస్‌స్టేషన్లకు తిప్పుతున్నారని, అతని గుండెకు స్టంట్, కాళ్లల్లో రాడ్లు ఉన్నాయని తెలిపారు.

ఇవి బూతులు కాదా ?

గతంలో మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెత్త నా..కొ.. అనలేదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ కాపు ఎమ్మెల్యే నా..కొ..లారా చెప్పులతో కొడతానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించ లేదా..ఇవీ బూతులు కాదా ? అని అంబటి ప్రశ్నించారు. ప్రముఖ దర్శకులు రాంగోపాల్‌వర్మ చంద్రబాబు, లోకేష్‌లపై వ్యంగంగా పోస్టులు పెట్టారని ఏపీలోని పలు పీఎస్‌ల్లో ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. ఇది తగదని హితవు పలికారు.

రెడ్‌బుక్ రచయిత లోకేష్

చాలా మంది పుస్తకాలు రాశారని, రెడ్‌బుక్ రాసిన మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రచయితగా నిలిచారని ఎద్దేవా చేశారు. త్వరలో రెడ్‌బుక్కే మంత్రి నారా లోకేష్‌కు శాపంగా మారనుందని జోస్యం చెప్పారు.

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప–2ను ఎవ్వరూ ఆపలేరని అన్నారు. గతంలో నందమూరి కుటుంబం కూడా జూనియర్ ఎన్టీఆర్ సినిమాలను ఆపగలిగారా ? అని ప్రశ్నించారు. మిర్చియార్డు మాజీ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), కార్పొరేటర్లు బూసి రాజలత, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), మహమూద్, అబీద్, లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు పోలూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డెక్కితే 'టోల్' తీతే !

- ఉమ్మడి గుంటూరులో మొదటి దశలో మూడు రోడ్లు
- రెండో దశలో ఏడు రోడ్లు
- పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం
- అమలులోకి వస్తే ఏ ప్రధాన రోడ్డుపైకి వచ్చినా టోల్ కట్టాల్సిందే...
- రోడ్ల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంటున్న ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లాలోని రాష్ట్ర రహదారులపై ఇకపై వాహనాన్ని తీసుకెళ్తే టోల్ కట్టాల్సిందే. రాష్ట్ర రహదారుల నిర్వహణ బాధ్యత నుంచి దశల వారీగా తప్పుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికోసం గుంటూరు జిల్లాలో మొదటి దశలో మూడు ప్రధాన రహదారులు, రెండో దశలో ఏడు ప్రధాన రహదారులను ఎంపిక చేసింది. జాతీయ రహదారులపై ఇప్పటికే టోల్ వసూలు చేస్తుండగా ప్రధానమైన రాష్ట్ర రహదారుల నుంచి కూడా చేయాలని నిర్ణయించారు. దీనివల్ల వాహనదారులపై పెనుభారం పడనుంది. గుంటూరు నుంచి తెనాలి, బాపట్ల, పర్చూరు, సత్తెనపల్లి, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల .. ఇలా ఎక్కడికి వెళ్లాలన్నా టోల్ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఇప్పటికే విజయవాడ వెళ్లి రావాలంటే కారుకు రూ. 225 వసూలు చేస్తున్నారు. ఇప్పుడు రాష్ట్ర రహదారుల వంతు వచ్చింది.

ఐదేళ్లకోసారి తారు లేయర్

మొదటి దశలో గుంటూరు నుంచి పర్చూరు వరకు 41.44 కిలోమీటర్లు, గుంటూరు నుంచి బాపట్ల వరకూ 51.24 కిలోమీటర్లు, మంగళగిరి–తెనాలి–నారాకోడూరు వరకూ 40.05 కిలోమీటర్లు అంటే సుమారు 132.73 కిలోమీటర్ల రహదారిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనున్నారు. ఆయా రోడ్ల నిర్వహణను కాంట్రాక్టు సంపాదించుకున్న వ్యక్తులే చూస్తారు. గుంతలు పూడ్చడంతో పాటు ఐదేళ్లకోసారి తారు లేయర్ వేస్తారు.

- రెండోవ దశలో పర్చూరు–జాగర్లమూడి–పరిమెట్ల మధ్య 54.53 కిలోమీటర్లు, అద్దంకి–సంతమాగలూరు మధ్య 40.15 కి.మీ, మాచర్ల–కారంపూడి–వినుకొండ మధ్య 72.61 కిలోమీటర్లు, కొండ్రముట్ల–బండ్లమోటు–దుర్గి మధ్య 54 కిలోమీటర్లు, సత్తెనపల్లి–మడిపాడు మధ్య 53.9 కిలోమీటర్లు, సకిరికల్లు– గురజాల మధ్య 44.18, వినుకొండ నుంచి ప్రకాశం జిల్లా పొదిలి వరకూ 56.14 కిలోమీటర్ల మేర రహదారులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనున్నారు.
- మొదటి రెండు దశల్లో కలిపి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలలో 508.24 కిలోమీటర్లు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనున్నారు. ఆయా రోడ్లలో ప్రస్తుతం ఎంత ట్రాఫిక్ ఉంది.. భవిష్యత్‌లో ఎంత పెరుగుతుంది.. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు కాకుండా ఇతర వాహనాలు ఎన్ని వెళ్తాయి.. ఎంత టోల్ వసూలు అవుతుంది.. కాంట్రాక్టర్‌కు గిట్టుబాటు అవుతుందా? కాకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఎంత చెల్లించాల్సి వస్తుందనే అంశాలపై ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేస్తున్నారు.
- తెనాలి, బాపట్ల రూట్లలో గిట్టుబాటు అయినా పర్చూరు రూట్ గిట్టుబాటు కాదని చెబుతున్నారు.
- ట్రాఫిక్ రద్దీ తక్కువగా ఉన్న రోడ్ల నిర్వహణకు కాంట్రాక్టర్లు ముందుకు వస్తారా లేదా ? అనే అంశాలపై కూడా ఆర్ అండ్ బీ అధికారులు లెక్కలు కడుతున్నారు. ఏది ఏమైనా ప్రజల నుంచి టోల్ వసూలు చేసి వారి నడ్డి విరవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించను

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ , అధికారులు

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించనని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలు అందించే అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని, సమస్యల పరిష్కారంలో నిర్లిప్తత ఉండకూడదని అధికారులకు తెలిపారు. బియాండ్ ఎస్ఎల్ఏలోకి అర్జీలు వెళితే సంబంధిత అధికారికి మెమో జారీ చేయాలని ఆదేశించారు. తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీ పెట్టుకునే హక్కు ప్రజలకు ఉంటుందని, వాటిని సక్రమంగా పరిష్కరించాల్సిన బాధ్యత మనపై ఉందని స్పష్టం చేశారు. కొందరు వాటిని తూతూమంత్రంగా పరిష్కరించి అర్జీదారునికి తెలియకుండా క్లోజ్ చేస్తున్నారని, వారిపై చర్యలకు వెనుకాడమని తెలిపారు. అనంతరం వచ్చిన 166 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఖోఖో



ప్రథమ స్థానం సాధించిన గుంటూరు జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

- బాలుర విభాగం విజేత గుంటూరు
- బాలికల విభాగం విజేత చిత్తూరు

కారెంపూడి: అంతర జిల్లాల అండర్ 14 బాల, బాలికల ఖోఖో క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. బాలుర విభాగంలో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకుంది. ప్రకాశం జిల్లా జట్టు ద్వితీయ స్థానాన్ని, చిత్తూరు జిల్లా జట్టు తృతీయ స్థానాన్ని పొందాయి బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించింది. శ్రీకాకుళం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, విశాఖపట్నం జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విజేతలకు ట్రోఫీలను, బహుమతులను ప్రదానం చేశారు. గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ సరస్వతీభాయి, విద్యా కమిటీ చైర్మన్ బాలునాయక్, జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ సురేష్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వర్ణరాజు, శ్రీనివాసరావు, చినరత్తయ్య, చిరంజీవిరావు, రాధాకృష్ణమూర్తి, కాశేశ్వరరావు, ప్రసాద్‌లతో పాటు ఉమ్మడి జిల్లాలోని పీఈటీలందరూ పోటీల నిర్వహణలో పాల్గొన్నారు.

కులగణనను సమగ్రంగా చేపట్టాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించ తలపెట్టిన కులగణనను సమగ్రంగా నిర్వహించాలి. బ్రిటిష్ ఇండియాలో 1931లో జరిపిన కులగణన తప్పా ఇప్పటి వరకు ఎటువంటి కార్యక్రమం నిర్వహించలేదు. కులగణన వల్ల పేద ప్రజలకు న్యాయమైన సామాజిక న్యాయం సాధించే వీలుంటుంది. కూటమి ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలి.

– కుమ్మరి క్రాంతి కుమార్, పారేపల్లి మహేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మంచినీటి సౌకర్యం కల్పించండి



పెదపలకలూరి రోడ్డులోని రత్నగిరి కాలనీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన సుమారు 200 పేద కుటుంబాలు 30 ఏళ్లుగా నివసిస్తున్నాం. తాగడానికి కనీసం మంచినీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నాం. మున్సిపల్ వాటర్ ట్యాంక్ కూడా నెలకు రెండు, మూడు సార్లే వస్తోంది. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

–కె.శ్రీనివాసరావు, సీఐటీయూ నగర కార్యదర్శి, స్థానికులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,500 గరిష్ఠం : రూ. 3,300

మోడల్ ధర రూ. 3900

తెలంగాణ అకడమిక్ కన్సల్టెంటుగా రమేష్‌బాబు నియామకం



తెనాలి: హైదరాబాద్ కేంద్రంగా దేశ అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలపై పనిచేస్తున్న ఏకైక మానవ రక్షణ అధ్యయన సంస్థ (సీహెచ్ఎస్ఎస్) వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కన్నెగంటి రమేష్‌బాబు తెలంగాణలో మరో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అకడమిక్ కన్సల్టెంటుగా నియమితులయ్యారు. ఈ ప్రకారం ఉత్తర్వులు అందుకున్నట్లు సోమవారం తెలియజేశారు. ప్రముఖ స్వాతంత్ర్య ఉద్యమనేత కన్నెగంటి హనుమంతు మునిమనవడైన రమేష్‌బాబు తెనాలికి చెందినవారని తెలిసిందే. పన్నెండేళ్లుగా హైదరాబాద్‌లో సీహెచ్ఎస్ఎస్ సంస్థను నిర్వహిస్తూ ఉగ్రవాదం, తీవ్రవాదం, పేదరికం, నిరక్షరాస్యత, మానవ భద్రత అంశాలపై వివిధ ప్రభుత్వాలు, అసోసియేషన్లతో కలిసి పనిచేస్తున్నారు. గత నెలలో అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో కృత్రిమ మేధపై జరిగిన అంతర్జాతీయ సదస్సుకూ హాజరై వచ్చారు. మానవ భద్రత అంశాన్ని పాఠ్యాంశం చేయాలనేది తన భావనగా చెబుతుండే రమేష్‌బాబు, తాజా బాధ్యతల్లో ఏం చేస్తారనేది వేచి చూడాలి.



కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు



స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

పోటెత్తిన భక్తులు

- శివ నామ స్మరణతో మార్మోగిన పెదకాకాని శివక్షేత్రం
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు
- ఒక్కరోజులో స్వామికి రూ.10,10,000 ఆదాయం

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శివాలయం సోమవారం శివ నామస్మరణతో మార్మోగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని దీపాలు వెలిగించి, పూజలు చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా ఎటు చూసినా కార్తిక దీపాలు వెలిగించే భక్తులే కనిపించారు. తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి ప్రారంభమైంది. ప్రాంగణంలోని యజ్ఞాల బావి నీటితో స్నానాలు చేసి భక్తులు ఆలయం చుట్టూ శివనామం స్మరిస్తూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ ఆవరణలో కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. త్వరితగతిన దర్శనం జరిగేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లలో దాతల సహకారంతో ఉచితంగా పాలు, మజ్జిగ, తాగునీరు అందించారు. ఆలయంలో అధికంగా అంత్రాలయ అభిషేకాలు, దర్శనాలు, ఏకవారాభిషేక పూజలు, రాహుకేతు పూజలు, అన్నప్రాసనలు, చెవిపోగులు కుట్టించడం, నామకరణలు, ఏకవారాభిషేక పూజలు, వాహనపూజలు, నవగ్రహ పూజలు అధికంగా జరిగాయి. వివిధ సేవా కార్యక్రమాల ద్వారా స్వామివారికి ఒక్క రోజులో రూ.10,10,000 ఆదాయం లభించిందని డెప్యూటీ కమిషనర్ కామినేని బసవ శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు అసౌర్యం కలుగకుండా పెదకాకాని పోలీసులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, పంచాయితీ సిబ్బంది సహాయ సహకారాలు అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ కె.బి. శ్రీనివాస్ తెలిపారు.

మహిళల సంరక్షణ కోసం మహిళా.. మీ కోసం



పచ్చ జెండా ఊపి స్కూటీలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, కమిషనర్ పులి శ్రీనివాసులు

- ఆపద వేళల్లో మహిళలకు 97464 14641 ద్వారా సహాయం
- పచ్చజెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్, నగర కమిషనర్, జిల్లా ఎస్పీ

నగరంపాలెం: మహిళల సంరక్షణ కోసం 'మహిళా.. మీకోసం' అంటూ ఒక వినూత్న కార్యక్రమాన్ని అందుబాటులోకి తేవడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ నూతనంగా తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నగరంపాలెం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆమెతో పాటు నగర కమిషనర్ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక మహిళగా రాత్రివేళల్లో ఏదైనా ప్రయాణం చేయాల్సి వస్తే కొన్నిసార్లు ఆలోచిస్తామన్నారు. ఆ సమయంలో మేమున్నాం అంటూ భరోసా కల్పిస్తే మహిళగా తమకు ఎంతో ధైర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అటువంటి భరోసా, భద్రతను కల్పించే సరికొత్త కార్యక్రమానికి జిల్లా పోలీస్ శాఖ ఆచరణలోకి తీసుకురావడం హర్షణీయమని చెప్పారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ఆ మార్గంలో ప్రయాణించేందుకు భయంగా ఉందని మహిళలు చెప్పేవారని అన్నారు. అటువంటి మార్గాల్లో మహిళల భద్రత కోసం ఏదైనా చేయాలనే ఆలోచన వచ్చేదని పేర్కొన్నారు. అటువంటి ఆలోచనకు శ్రీకారం చుడుతూ 'మహిళా..మీ కోసం' అంటూ అమల్లోకి తీసుకురావడం బాగుందని తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ కార్యక్రమ ఆవిష్కరణకు నెల రోజులుగా శ్రమించామని అన్నారు. మహిళలు ఆపద తలెత్తితే 9746414641 నంబర్ ద్వారా సహాయం పొందవచ్చునని సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, శాస్త్రీయ నృత్యాలు, లఘు నాటికల ప్రదర్శనలు, కళాశాలల విద్యార్థుల ప్రసంగాలు నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణించిన వారిని సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు.

ఏఎన్‌యూలో 11, 12 తేదీల్లో జాతీయ సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య కె. గంగాధరరావు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను సోమవారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాలచలం తదితరులు ఆవిష్కరించారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి. రవిశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ. ప్రమీలారాణి వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబర్ 11, 12 తేదీలలో 'ఔషధాల ఆవిష్కరణ అభివృద్ధిలో బహుళ విభాగ పరిశోధన' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సుకు ముఖ్య ప్రసంగీకులుగా జబల్‌పూర్ మంగళమాటస్ యూనివర్సిటీ వీసీ ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు హాజరు కామన్నారని పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఐ. బాలకృష్ణ, కేరళలోని త్రివేండ్రం రీజినల్ క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ నుంచి డాక్టర్ బి. చంద్రశేఖరన్, బెంగళూరులోని ఆల్ అమీన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ సల్లాహుద్దీన్, హైదరాబాద్ నల్ల నరసింహారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డీన్ డాక్టర్ సీహెచ్. కృష్ణమోహన్ హాజరై ఉపన్యాసాలు చేస్తారని పేర్కొన్నారు. మేడికొండూరులోని కేసిరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ కో స్పాన్సర్‌గా ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. కన్వీనర్‌గా డాక్టర్ అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కె. సుజనా, కోశాధికారిగా డాక్టర్ కె.ఈ. ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా డాక్టర్ షేక్ మస్తానమ్మ, కె. విజయ్ కిషోర్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి. రవి, డాక్టర్ ఎం. గాయత్రి రమ్య, ఎంఏఎం ఫార్మసీ కళాశాల చైర్మన్ ఎం. శేషగిరిరావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత విజయవాడ రీజియన్



కొరిటిపాడు(గుంటూరు): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సొరాబ్జీ పోచ్కనావాలా మెమోరియల్ ఇంటర్ రీజియన్ క్రికెట్ టోర్నమెంట్‌ను మొత్తం ఏడు ప్రాంతాలకు గానూ ఈ నెల 23, 24వ తేదీల్లో గుంటూరులో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను హైదరాబాద్ జోన్ జోనల్ హెడ్ ధరాసింగ్ నాయక్ ప్రారంభించారు. అన్ని జట్లు మంచి క్రీడా స్ఫూర్తితో పాల్గొన్నాయి. సతీష్ నేతృత్వంలోని విజయవాడ రీజియన్ విజేతలుగా, ఏఎస్ఎన్ మూర్తి సారథ్యంలోని విశాఖపట్నం రీజియన్ రన్నరప్‌గా నిలిచాయి. టోర్నమెంట్‌ను గుంటూరు రీజినల్ హెడ్ ఈ.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులతో మహిళల్లో చైతన్యం

జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక



గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశ రాజ్యాంగం కల్పించిన హక్కులతో మహిళలు చైతన్యవంతులై అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో సోమవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు జిల్లాస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. డీఈవో రేణుక మాట్లాడుతూ భారత రాజ్యాంగం 75 ఏళ్లు పూర్తి చేసుకోవడం ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు. విద్యార్థులు, యువతరం రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు, స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలు సైతం భారత రాజ్యాంగం పట్ల ఉన్నత భావన కలిగి ఉన్నాయని అన్నారు. ఈసందర్భంగా విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు, డీసీఈబీ కార్యదర్శి ఏ.తిరుమలేష్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ఎంఈవోలు జ్యోతికిరణ్, నాగేంద్రమ్మ, అబ్దుల్ ఖుద్దూస్, పలువురు హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ లాన్ టెన్నిస్‌లో ఏపీకి ద్వితీయ స్థానం



కప్, బహుమతులు అందుకుంటున్న కేవీఎల్ఎన్ మూర్తి, మహేష్

కొరిటిపాడు(గుంటూరు): ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ లాన్ టెన్నిస్‌లో టోర్నమెంట్ ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిందని డీఈ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ తరఫున సూపరింటెండెంట్ ఇంజినీర్ కేవీఎల్ఎన్ మూర్తి, తెనాలి లైన్‌మేన్ మహేష్‌లు ఆడి ఓపెన్ డబుల్స్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరూ కలసి పట్టుదల, నిబద్ధతతో ఈ టోర్నమెంటులో ఆడి ప్రతి పాయింట్‌లోనూ ముందంజలో నిలిచారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తీసుకువచ్చిన మూర్తి, మహేష్‌లకు విద్యుత్‌శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపినట్లు వివరించారు.

పీఎఫ్ సౌకర్యం కల్పించండి



కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఉద్యోగులు

గుంటూరు వెస్ట్ : సుమారు 30 సంవత్సరాలు నిస్వార్థ సేవ చేసినందుకు తమకు న్యాయం చేయాలని వీఆర్వో (గ్రామ పునర్ నిర్మాణ సంస్థ) ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం గుంటూరు కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. వీఆర్వో సంస్థ గ్రామాభివృద్ధితోపాటు విద్యా వికాసానికి కృషి చేశామని చెప్పారు. జిల్లాలో సుమారు 1500 మంది ఉన్నారని వారందరికీ ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలని సంస్థ సభ్యుడు టి.మహతి తదితరులు విజ్ఞప్తి చేశారు.

చట్ట పరిధిలో బాధితులకు న్యాయం

- ఎస్పీ సతీష్‌కుమార్ భరోసా
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ
- డిజిటల్, ఆన్‌లైన్ మోసాలపై పలువురి ఫిర్యాదు



సమస్య ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులు ఫిర్యాదులు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదిదారుల బాధను ఆయన ఆలకించారు. సాధ్యమైనంత త్వరగా చట్ట పరిధిలో న్యాయం చేయాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.

మొబైల్ నంబర్‌తో వస్తువుల కొనుగోలు

గతేడాది మార్చిలో ఓ కంపెనీ ఉద్యోగి వచ్చారు. సదరు కంపెనీ కార్డు రద్దు చేయాలని కోరగా, తమ వద్ద మొబైల్ నంబర్ తీసేసుకున్నాడు. ఇటీవల సదరు కంపెనీ నుంచి సిబ్బంది వచ్చి, రూ.1.80 లక్షలకు ఈఎంఐలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. తాము ఎలాంటి వస్తువులు కొనుగోలు చేయలేదని, వారి దృష్టికి తీసుకువచ్చాం. అయితే గతంలో తమ వద్దకు వచ్చి మొబైల్ నంబర్ తీసుకున్న వ్యక్తి ఈ మోసానికి పాల్పడినట్లు గుర్తించాం. తమ నంబర్‌తో వేరొక మహిళ ఫొటో జత చేసి రెండు ఖరీదైన మొబైల్‌ఫోన్లు కొనుగోలు చేశాడు. ఆ రెండింటికీ నమ్మకం కలిగించేలా ఈఎంఐలు చెల్లించాడు. కాలక్రమేణా ఏసీ కూడా కొనుగోలు చేశాడని తెలిసింది. ఈ మూడింటికి కలిపి రూ.1.80 లక్షలు చెల్లించాలని చెబుతున్నారు. ప్రస్తుతం తాము ఈఎంఐలు చెల్లించే పరిస్థితి లేదు. సదరు వ్యక్తిని పిలిచి విచారించి, తమకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

– పి.దీనకుమారి, అంకిరెడ్డిపాలెం

కానిస్టేబుల్ కొట్టాడు

ఈనెల 14న బస్టాండ్ నుంచి అరండల్‌పేటకు ఆటో బాడుగకు వెళ్లాను. తిరుగు ప్రయాణంలో గుంటూరు రైల్వేస్టేషన్ ఏడో నంబర్ ప్లాట్‌ఫాంపై నిద్రకు ఉపక్రమించాను. ఈ క్రమంలో జీఆర్పీ కానిస్టేబుల్ వచ్చి లాఠీతో కొట్టగా, ఎడమ చేతికి గాయమైంది. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు వెళ్లగా చేయి విరిగిందని చెప్పి, చికిత్స అందించారు. సదరు కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని జీఆర్పీ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. ప్రస్తుతం విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు చెప్పారు. అప్పటి వరకు ఆటో నడిపే పరిస్థితి లేదు. న్యాయం చేయగలరు.

– ఆటోడ్రైవర్, సుబ్రమణ్యంఆచారి, రెడ్డిపాలెం

క్యూఆర్ కోడ్ పేరుతో మోసం

పొన్నెకల్లులో చిల్లర దుకాణంతో జీవిస్తాను. క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తానని ఓ కంపెనీ నుంచి ఓ వ్యక్తి వచ్చాడు. ఆధార్, పాన్ కార్డుల నంబర్లు, ఫొటోలు వంటి ఆధారాలు తీసేసుకుని కోడ్ యిచ్చాడు. ఇటీవల ఫైనాన్స్ కంపెనీ నుంచి సిబ్బంది వచ్చి ఈఎంఐలు సక్రమంగా చెల్లించడంలేదని తెలిపారు. లోన్ కింద తాను ఏమి తీసుకోలేదని చెప్పగా, రూ.2 లక్షలు ఖరీదు చేసే గృహోపకరాలు తీసుకున్నారని చెప్పారు. గతంలో క్యూఆర్ కోడ్ నిమిత్తం వచ్చిన వ్యక్తి ఈ మోసానికి పాల్పడినట్లు తెలిసింది. ఫైనాన్స్ కంపెనీ, ఓ బ్యాంక్, సదరు వ్యక్తి కలిసికట్టుగా మోసగించారు. స్థానిక పోలీసులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఆ ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– ఎస్.సురేంద్రరెడ్డి, పొన్నెకల్లు, తాడికొండ

సోదరునికి రూ.33 లక్షలు ఇచ్చా..

ఐదేళ్ల క్రితం సోదరునికి రూ.33 లక్షలు అప్పుగా యిచ్చాను. కొన్నాళ్లు సక్రమంగా వడ్డీ చెల్లించాడు. సుమారు 14 నెలలు క్రితం నా కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి సోదరుడు వడ్డీ, అసలు యివ్వడంలేదు. డబ్బులు యివ్వమని అడిగితే నాపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు. సొంతిల్లు సరిగాలేకపోవడం, జీవనాధారం కోల్పోవడంతో కొరిటెపాడులోని కుమార్తె వద్ద ఉంటున్నా. సోదరుని పిలిచి న్యాయం చేయాలని కోరుతున్నా.

– ఎస్.తులసమ్మ, కొరిటెపాడు

ఇల్లు ఖాళీ చేయడం లేదు

నాలుగేళ్ల నుంచి బావ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అద్దె చెల్లించడంలేదు. ప్రస్తుతం ఇల్లు ఖాళీ చేయమని అడిగితే తమను బెదిరిస్తున్నారు. గతంలో స్థానిక పోలీసులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. న్యాయం చేయగలరు.

– షేక్.మస్తాన్‌వలి, నల్లచెరువు 16/2వ అడ్డ రోడ్డు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన తెలంగాణ రైతులు



వడ్లమూడిలో వరి పొలాలను సందర్శిస్తున్న తెలంగాణ రైతులు

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడిలో సాగులో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, వరంగల్ జిల్లాలకు చెందిన రైతులు సోమవారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన పంటలు పండించి విజయాలను సాధిస్తున్న స్థానిక రైతులను కలిశారు. సాగు వివరాలు, దిగుబడి, పంట నాణ్యత గురించి తెలుసుకున్నారు. వడ్లమూడి రైతులు సూర్యదేవర ఉమామహేశ్వరరావు, పాటిబండ్ల శ్రీధర్ సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో వరి పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి పండించడం వల్ల వేరు వ్యవస్థ దృఢంగా ఉంటుందని, దిగుబడి కూడా బాగుంటుందని రైతులు వివరించారు. వరి ఒకటే కాకుండా, గట్ల మీద రకరకాల కూరగాయలు పండించుకొని తినడం ద్వారా వారి ఆరోగ్యంతో పాటు కొంత ఆదాయం కూడా వస్తుందని తెలంగాణ రైతులకు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరిస్తామని తెలంగాణ రైతులు తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు అభిలాష్, అనూష, మైలా వెంకటరామరాజు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో నాయకుడు బ్రహ్మారెడ్డి మృతి




గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీవో అమరావతి తాలూకా అధ్యక్షుడు వజ్రాల బ్రహ్మారెడ్డి(56) గుండె సంబంధిత వ్యాధితో ఆదివారం రాత్రి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. వైద్య ఆరోగ్య శాఖ చిలకలూరిపేటలో ఎంపీహెచ్ఈఓగా బ్రహ్మారెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ శెట్టిపల్లి సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, నగర అధ్యక్షుడు సూరి, కార్యదర్శి కళ్యాణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, తదితరులు బ్రహ్మారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మహారుద్రాభిషేకం చేస్తున్న పరమపూజ్య శ్రీశ్రీశ్రీ డాక్టర్ రాజేష్‌నాథ్‌జీ అఘోరి

ప్లాస్టిక్ వినియోగంతో మానవాళికి పెనుముప్పు

- గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు
- ఆకట్టుకున్న పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో డీవైఈవో వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించి, మానవాళి మనుగడకు సవాల్‌గా మారిందిన గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్-విద్యాశాఖ సంయుక్తంగా జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్-2024 నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ''చెత్త వ్యర్థాల నుంచి సంపద సృష్టించడం'' అనే అంశంపై వివిధ నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీవైఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా నార, వస్త్రంతో తయారు చేసిన సంచులను ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ప్రదర్శనలో విద్యార్థులు వివిధ రకాల మోడల్ నమూనాలను తయారుచేసి ప్రదర్శించారు. పర్యావరణ కాలుష్యం-తగ్గించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశంపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 94 పాఠశాలల నుంచి 225 మంది పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, ఎంఈవోలు బీవీ రమణయ్య, జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ డీసీఈబీ కార్యదర్శి ఏ.తిరుమలేష్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, హెచ్ఎంలు జిలానీ బాషా, వసుంధర, మణికుమార్, శ్రీనివాసరావు, రీసోర్స్ పర్సన్లు ఆయేషా సుల్తానా, శివశంకర్, అప్పారావు, శాంతిప్రియ, గంగాధర్, శ్రీనివాసరావు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో కొలకలూరు జెడ్పీ హైస్కూల్, చిత్రలేఖనంలో మేడికొండూరు జెడ్పీ హైస్కూల్ ప్రథమ బహుమతి, కాకుమాను జెడ్పీ హైస్కూల్, గుంటూరు చౌత్రాలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ద్వితీయ బహుమతి, దుగ్గిరాల జెడ్పీ హైస్కూల్, ఎస్కేబీఎం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు.